# ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం
## ప్రాంతీయ వార్తా విభాగం
## ప్రాంతీయ వార్తలు

**తేదీ: 03.05.2026** **మధ్యాహ్నం:13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. స్వయంసమృద్ధి భారత్ లక్ష్యాల సాధనలో గ్రామ పంచాయతీల పాత్ర అత్యంత కీలకమని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు.
2. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ విప్ లు క్రియా శీలక పాత్ర పోషించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.
3. రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులిచ్చేందుకు కేంద్రం అంగీకరించిందని సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వెల్లడించారు.
4. ఈ రోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

..............................................................

**VIVEK BHARADWAJ – PR SECRETARY**

స్వయంసమృద్ధి భారత్, వికసిత భారత్ వంటి దీర్ఘకాలిక లక్ష్యాల సాధనలో 'స్వయంసమృద్ధి పంచాయతీ'ల పాత్ర అత్యంత కీలకమని కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీ-పీఆర్)లో నిన్న నిర్వహించిన 'స్వయంసమృద్ధి పంచాయతీ కార్యక్రమంలో వివేక్ భరద్వాజ్ కీలకోపన్యాసం చేశారు. క్షేత్రస్థాయి పరిపాలనకు గల పరిణామాత్మక శక్తిని ప్రస్ఫుటం చేస్తూ- స్వావలంబన, సాధికారతగల పంచాయతీల

తోడ్పాటుతో ఈ దార్శనికతను సాకారం చేసుకోవచ్చన్నారు. జాతీయ రూపాంతరీకరణలో పంచాయతీలే కీలక ఉపకరణాలని, పౌరులలో చైతన్యం రగిలించడంలో అవి ఎంతగానో తోడ్పడగలవని వివరించారు. పంచాయతీల నాయకులు తమ పరిధిలో అర్థవంతమైన, శాశ్వత ప్రభావ సృష్టి దిశగా వినూత్న ఆలోచనలతో నిర్ణయాత్మకంగా వ్యవహరించాలని కోరారు.

....... పిఐబి

**CM – GOVT WHIPS**

ప్రజా సమస్యలను పరిష్కరించడం, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో ప్రభుత్వ విప్ లు కీలక భూమిక పోషించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. నిన్న రాత్రి ప్రభుత్వ విప్ లు ముఖ్యమంత్రిని కలుసుకొని క్షేత్ర స్థాయి సమస్యలను నివేదించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి నేపథ్యంలో నియోజకవర్గాల్లో తాగు, సాగునీటి సమస్యల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, శాసనసభ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, వేముల వీరేశం తదితరులు ఉన్నారు.

...... పిటీసీ హైదరాబాద్

**KISHAN REDDY**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను పురస్కరించుకుని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో వాల్ రైటింగ్ క్యాంపెయిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో అవినీతి, కుటుంబ పాలన నుంచి విముక్తి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

........పిటీసీ హైదరాబాద్

**NEET EXAM**

వైద్యవిద్యలో ప్రవేశం కోసం ఈ రోజు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న 'నీట్-యూజీ 2026'కు సర్వం సిద్ధమైంది. నీట్ రాసేవారు నిబంధనలన్నీ పక్కాగా పాటించాలని రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ నరేంద్రకుమార్ తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతి ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరగనుందన్నారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు.

......డెస్క్

**MAHABOOBNAGAR – GOV WHIP**

మహబూబ్‌నగర్ నగరాభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు గత రెండు సంవత్సరాలుగా నిరంతర కృషి కొనసాగుతోందన్నారు. MVS డిగ్రీ కళాశాల మైదానంలో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న వాకింగ్ ట్రాక్‌కు ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పట్టణ సుందరీకరణలో భాగంగా వివిధ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో పార్కులు, ఓపెన్ జిమ్‌లు, మహిళా జిమ్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

....... పిటీసీ, మహబూబ్‌నగర్

**MULUGU – NO SHORTAGE OF FUEL**

ములుగు జిల్లాలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని జిల్లా పౌర సరఫరాల అధికారి ఫైజల్ హుస్సేన్ స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ పై వస్తున్న వదంతుల నేపథ్యంలో ఫైజల్ హుస్సేన్ ఆకాశవాణి ప్రతినిధితో మాట్లాడారు. జిల్లాలో సరిపడినంత చమురు నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. వినియోగదారులెవరూ వదంతులను నమ్మవద్దన్నారు.

**బైట్... ఫైజల్ హుస్సేన్**

.....పిటీసీ, ములుగు

**SINGARENI – PERMISSIONS**

రామగుండం కోల్ మైన్ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ ప్రాథమిక అనుమతుల మంజూరుకు అంగీకారం తెలిపిందని సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా ఏడాదికి 210 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సామర్ధ్యంతో రూపొందించిన ఈ వినూత్న ప్రాజెక్టుకు ప్రాథమిక పర్యావరణ అనుమతులు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మూతపడుతున్న పాత గనుల ఉత్పత్తిని భర్తీ చేయడానికి, ఇప్పటికే కనీస అనుమతులు ఉన్న రెండు ఓపెన్ కాస్ట్ గనులు, మూడు భూగర్భ గనుల పరిధిలో 314 మిలియన్ టన్నులను నిల్వలను వెలికి తీయడానికి ఈ ప్రాజెక్టును రూపొందించామన్నారు. ప్రకృతి వరమైన బొగ్గును గరిష్టంగా వెలికి తీయడమే సంస్థ లక్ష్యమన్నారు.

...... ప్రెస్ నోట్

**CPI NARAYANA**

నల్గొండ జిల్లా చిట్యాల మండలంలోని నోస్ ల్యాబ్ ఫ్యాక్టరీలో నెల వ్యవధిలో రెండు ప్రమాదాలు జరగడం పట్ల సీపీఐ కేంద్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కే. నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల్లో తరచుగా జరుగుతున్న ప్రమాదాలు యాజమాన్య నిర్లక్ష్యాన్ని బహిర్గతం చేస్తున్నాయన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మికుల భద్రత, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తోందన్నారు. ప్రభుత్వ నియంత్రణ సంస్థలు కూడా ప్రమాదాలను నివారించడంలో విఫలమవుతున్నాయన్నారు. దోషులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, కార్మికుల రక్షణ కోసం కఠినమైన భద్రతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

........ ప్రెస్ నోట్

**CYBARABAD COMISSIONER**

వాణిజ్య సంస్థలు, మాల్స్, ఇతర వ్యాపార కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్ల దగ్గర తప్పనిసరిగా చెత్త బిన్ లను ఏర్పాటు చేసుకోవాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన

సూచించారు. లేని పక్షంలో వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ రోజు ఆమె మాదాపూర్‌లో మీడియాతో మాట్లాడారు. సైబరాబాద్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను అత్యంత ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని చెప్పారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, స్పోర్ట్స్, రెవెన్యూ, శానిటేషన్, ఎంటమాలజీ వంటి కార్యక్రమాలను చేపట్టడానికి వ్యవస్థాగతమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

......... డెస్క్

## SIRCILLA – AGRICULTURE OFFICER

రైతులు వరి కోతల సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించడం వల్ల నాణ్యత గల ధాన్యాన్ని పొందవచ్చునని రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల వ్యవసాయ అధికారి దుర్గరాజు చెప్పారు. ఆకాశవాణి ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ......

**బైట్... వ్యవసాయ అధికారి దుర్గరాజు**

......పిటిసీ, రాజన్న సిరిసిల్లా

## IMD – TEMPERATURES

ఈ రోజు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాబోయే రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో ఎటువంటి మార్పు ఉండదని తెలిపింది. ఆ తర్వాత నాలుగు రోజుల్లో రెండు నుండి నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతల్లో తగ్గుదల ఉంటుందని చెప్పింది. నిన్న అత్యధికంగా 12 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించింది.

..... డెస్క్

## CRICKET

సూపర్ సండే నేపథ్యంలో ఐపీఎల్ 2026లో భాగంగా నేడు రెండు మ్యాచ్ లు జరగనున్నాయి. ఈ రోజు మధ్యాహ్నం మూడున్నర గంటలకు కేకేఆర్ తో హైదరాబాద్ జట్టు

తలపడనుంది. ఈ మ్యాచ్ హైదరాబాద్ లోని ఉప్పల్ స్టేడియం వేదికగా నిర్వహించనున్నారు. రాత్రి ఏడున్నర గంటలకు అహ్మదాబాద్ లో గుజరాత్ టైటాన్స్ తో పంజాబ్ కింగ్స్ తలపడుతుంది. దీంతో ఈ రోజు జరిగే రెండు మ్యాచ్ లను వీక్షించేందుకు క్రికెట్ అభిమానులు ఆసక్తి కనబరుస్తున్నారు.

........డెస్క్

## ORR – V C SAJJANAR

ఔటర్ రింగ్ రోడ్డుపై పెరుగుతున్న ప్రమాదాల నేపథ్యంలో వాహనదారులకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సీ. సజ్జనార్ కీలక హెచ్చరికలు జారీ చేశారు. బ్రేక్ డౌన్ మినహా ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఓఆర్ఆర్ పై నిలపవద్దన్నారు. ఒకవేళ అత్యవసరమైతే వెంటనే 14449 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ నియమాలు జాతీయ రహదారులకూ వర్తిస్తాయని, డ్రైవర్లకు దీనిపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

..... పిటీసీ హైదరాబాద్

## NALGONDA – GANJA GANG ARREST

ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి నల్గొండకు గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను నల్లగొండ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ రమేష్ మీడియాతో మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, కొత్తగూడెం జిల్లలకు చెందిన కొంతమంది మిత్రులు గ్యాంగ్ గా ఏర్పడి గంజాయి విక్రయిస్తుండగా పట్టుకున్నామన్నారు. యువత పొగాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. గంజాయి సేవించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

........ పిటీసీ, నల్లగొండ

## JANAGAMA – PRAJAVAANI

ప్రతి సోమవారం కలెక్టరేట్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఇకపై రేపటి నుంచి జిల్లాలోని అన్ని ఆర్డీవో కార్యాలయాల లో నిర్వహించడం జరుగుతుందని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా తెలిపారు. ఆర్డీవో కార్యాలయాలలో జరిగే ప్రజావాణిలో అన్ని విభాగాల అధికారులు పాల్గొంటారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

....... పిటీసీ, జనగాం

## KAMAREDDY – FIRE ACCIDENT

కామారెడ్డి పట్టణం పాత బస్టాండ్ వద్ద భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో 12 షాపులు దగ్ధమయ్యాయి. దాదాపు 50 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజిన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే, ప్రమాదానికి గల కారణాలు ఇంకా అధికారికంగా వెల్లడి కాలేదు.

.......పిటిసి, కామారెడ్డి